ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ పాలనపై పోరాటం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి

- బీఆర్ఎస్ నేత కౌశికహరి
- రామగుండంలో ఆత్మీయ సమ్మేళనం

జ్యోతినగర్(రామగుండం), నవంబర్ 11: సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన వ్యతిరేక విధానాలపై తమ పోరాటమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కౌశికహరి పేర్కొన్నారు. రామగుండంలో సోమవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో కౌశిక హరి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో జాప్యం, బీఆర్ఎస్ నాయకులపై వేధింపులపై మండిపడ్డారు . ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి తోడేటి శంకర్‌గౌడ్, కార్పొరేటర్ కౌశికలత, మాజీ సర్పంచ్‌లు మెరుగు పోచం, కొల్లూరి సతీశ్, ప్రవీణ్ కుమార్, కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం ప్రధానకార్యదర్శి మాదాసి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కొలిపాక శరణ్య మధూకర్‌రెడ్డి, నాయకులు కొమురయ్య, మదన్ మోహన్‌రావు, రాజమల్లయ్య పున్నం శశికుమార్, బండి శ్రీనివాస్ గౌడ్, పుట్ట శ్రీనివాస్ ఉన్నారు.

కరెంట్ షాక్ తగిలి అపస్మారక స్థితికి యువకుడు

- సీపీఆర్ చేసి కాపాడిన 108 సిబ్బంది

ధర్మారం,నవంబర్11: మల్లాపూర్‌కు చెందిన కొడిపెల్లి సందీప్ (28) కు కరెంట్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకోగా, 108 సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. 108 సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్లాపూర్ శివారులోని కొనుగోలు కేంద్రం వద్ద ఆదివారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో వడ్లు పట్టడానికి కరెంట్ వైర్ సరి చేస్తుండగా ఒక్కసారిగా షాక్ తగలడంతో సందీప్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సెంటర్‌లో ఉన్న వారు 108కు ఫోన్ చేయగా, సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈఎంటీ ఆరె సతీశ్ సీపీఆర్ చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడాడు .అనంతరం కరీంనగర్ లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అదే రాత్రి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. సకాలంలో స్పందించి, సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది ఈఎంటీ, పైలట్ ఆరె సతీశ్, నర్సింగంలను సందీప్ కుటుంబ సభ్యులు, డాక్టర్లు అభినందించారు.

చదువుతో పేదరికం దూరం

పెద్దపల్లి, నవంబర్11: చదువుతో పేదరికం దూరం చేయవచ్చునని అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు పేర్కొన్నారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో సోమవారం మైనారిటీ సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యాభివృద్ధికి కలాం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీ పోస్టులు పెంచాలి

- కలెక్టర్‌కు డీఎస్సీ అభ్యర్థుల విజ్ఞప్తి

పెద్దపల్లి, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): 2025 డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్‌జీటీ పోస్టులను పెంచాలని కోరుతూ సోమవారం డీఎస్సీ అభ్యర్థులు కలెక్టరేట్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తాము గత 2017టీఆర్‌టీ, 2024 డీఎస్సీలో పోస్టులు లేని కారణంగా ఉద్యోగం సాధించలేకపోయామన్నారు. అప్పుడు ఉమ్మడి జిల్లాల వారీగా భర్తీ ప్రక్రియ జరిగిందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తక్కువ పోస్టుల కారణంగా ఉద్యోగం పొందలేదన్నారు. అయితే రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా పోస్టులు పరిశీలించినప్పుడు ఎస్‌జీటీలో కేటగిరీతో కలుపుకొని కేవలం 14పోస్టులు మాత్రమే పెద్దపల్లి జిల్లాలో భర్తీ చేశారన్నారు. 74.13, 74.17, 73.4, 72, 71మార్కులు వచ్చినా ఉద్యోగం రానివారు జిల్లాలో చాలామంది ఉన్నారన్నారు. తమ ఆవేదనను అర్థం చేసుకొని ప్రభుత్వం 158 ఎస్‌జీటీ ఖాళీలు, ప్రమోషన్స్ ద్వారా ఏర్పడే 368 ఖాళీలను కలిపి వచ్చే 2025 డీఎస్సీ నోటిఫికేషన్‌లో భర్తీ చేయాలన్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన డీఎస్సీ అభ్యర్థులు

నమస్తే తెలంగాణ CLASSIFIED
సంపాదించుకోవచ్చు
★మీ ఇంటి వద్ద ఉండి రోజుకు 2 గం|| చేతివ్రాత ద్వారా నెలకు 10 వే||ల నుండి 15 వే||ల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. సెల్: 6304484084.
NTK-325693
NAME CHANGE
★I, Ramaswami Lakshman S/o Lakshman, R/o. Chinthakunta, Mdl. Kothapally, I have changed my Name As Kalakuntla Ramaswami S/o. Laxman. for all purposes. Cell: 79953 04168.
NTK-0000
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ట్రినిటి విద్యాసంస్థల స్పోర్ట్స్ మీట్

బ్రోచర్లు విడుదల చేస్తున్న దాసరి మమతారెడ్డి, ప్రిన్సిపాళ్లు

పెద్దపల్లి కమాన్, నవంబర్ 11 : ఈ నెల 12,13,14 తేదీల్లో పెద్దపల్లి ట్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి తెలిపారు. ట్రినిటీ సీబీఎస్‌ఈ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్ బ్రోచర్లను దాసరి మమతారెడ్డి సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ డీఎస్ కుమార్, సీబీఎస్‌ఈ స్కూల్ ప్రిన్సిపాల్ రత్నమాల, హాస్టల్ ఇన్‌చార్జి రహీమ్, రమేశ్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు నాయకుల ఫిర్యాదు

కోల్‌సిటీ, నవంబర్ 11: అడ్డగుంటపల్లిలోని ఫంక్షన్ హాలు నాలాపై ఉందని కూల్చివేసిన నగర పాలక అధికారులకు, ప్రధాన రహదారి పక్కన పెద్ద నాలాపై నిర్మించిన సాయిలీలా బార్ అండ్ రెస్టారెంట్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఏఐవైఎఫ్ నాయకులు ప్రశ్నించారు. ఈమేరకు సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అదనపు కలెక్టర్, బల్దియా కమిషనర్ అరుణ శ్రీకి ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్‌లో కక్ష సాధింపు ధోరణితో కూల్చివేతలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రధాన నాలాపై నిర్మించిన సాయిలీలా బార్ అండ్ రెస్టారెంట్ భవనంపై చర్యలు తీసుకోవాలని ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే నాలాపై ఉన్న రెస్టారెంట్‌ను తొలగించే చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, ఆసాల నవీన్, రానవేని సుధీర్ తదితరులున్నారు.

జనావాసాల్లోకి భారీ కొండ చిలువ

సుల్తానాబాద్, నవంబర్ 11 : పూసాలలో జనావాసాల్లోకి వచ్చిన భారీ కొండ చిలువను గ్రామస్తులు సోమవారం పట్టుకున్నారు. చెరువుతో పాటు, పొలాలు గ్రామానికి ఆనుకొని ఉండడంతో పాములు, కొండచిలువలు గ్రామంలోకి వస్తున్నాయని స్థానికులు తెలిపారు.

చిరువ్యాపారుల పొట్టకొట్టొద్దు

- అభివృద్ధి అంటే కూల్చివేతలేనా?
- రోడ్డునపడ్డ వ్యాపారులకు పరిహారం చెల్లించాలి
- వెంటనే ప్రత్యామ్నాయం చూపించాలి
- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్
- బల్దియాలో చిరు వ్యాపారులకు మద్దతుగా నిరసన దీక్ష

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, నవంబర్ 11: అభివృద్ధి పేరిట చిరువ్యాపారుల పొట్టకొట్టొద్దని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించకుండా అధికారులు ఇష్టానుసారంగా వారి దుకాణాలను కూల్చివేయడం దారుణమన్నారు. దిక్కుతోచనిస్థితిలో రోడ్డునపడిన వారికి వెంటనే ప్రత్యామ్నాయ మార్గం చూపించి, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో చిరు వ్యాపారులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే చందర్ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్దాల కేసీఆర్ పాలనలో రామగుండం కార్పొరేషన్‌కు అధిక మొత్తంలో నిధులను కేటాయించి అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ కార్పొరేషన్‌కు ₹100కోట్ల టీయూఎఫ్‌డీఈ నిధులు మంజూరు చేసి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. అభివృద్ధి అంటే కూల్చివేతలేనా? అని ప్రశ్నించారు. ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్, గోదావరిఖని పట్టణంలోని ఓల్డ్ అశోక్ టాకీస్, గాంధీనగర్, హనుమాన్‌నగర్‌లో చిరువ్యాపారులకు కేటాయించిన దుకాణాలను అధికారులు ఇష్టానుసారంగా కూల్చివేసి చిరువ్యాపారులను రోడ్డున పడేశారన్నారు. చిరువ్యాపారులకు బీఆర్ఎస్ పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని తెలిపారు. నిరసన దీక్షకు న్యూ ఇండియా పార్టీ నాయకులు జేవీ రాజు, వేముల అశోక్ సంఘీభావం తెలిపారు. దీక్షలో ఇక్కడ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, మాజీ జడ్పీటీసీ ఆములు నారాయణ, కార్పొరేటర్లు పెంట రాజేశ్, పాముకుంట్ల భాస్కర్, బాదే అంజలి, కల్వచర్ల కృష్ణవేణి, కుమ్మరి శ్రీనివాస్, గాధం విజయ, ఆయిత శివకుమార్, జనగామ కవితా సరోజన, మాజీ వైస్‌ఎంపీపీ మట్ట లక్ష్మి, మాజీ సర్పంచులు ధరిణి రాజేశ్, బండారి ప్రవీణ్, పల్లె శ్రీనివాస్, ఆర్నకపల్లి శ్రీనివాస్, మేకల పోశం, కొలిపాక మధూకర్‌రెడ్డి, నాయకులు గోపు ఐలయ్యాయాదవ్, తాళ్ల రాజయ్య, నారాయణదాసు మారుతి, అచ్చె వేణు, నూతి తిరుపతి పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు పకడ్బందీగా సేకరించాలి

పెద్దపల్లి రూరల్ : సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దపల్లి రూరల్, నవంబర్ 11: ఇంటింటా సర్వేలో ప్రతీ కుటుంబం వివరాలు పకడ్బందీగా సేకరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కాసులపల్లి, కాపులపల్లి, పాలితంలో కలెక్టర్ సోమవారం పర్యటించారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు, ఇంటింటా సర్వే ప్రక్రియను పరిశీలించారు. వడ్ల కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి శివ ప్రసాద్, కార్యదర్శులు అహ్మద్ పాషా, లక్ష్మణ్ బాబు, అధికారులున్నారు. దేవునిపల్లిలో ఇంటింటి సర్వేను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. మండలంలోని 30 పంచాయతీల్లో ఇప్పటి వరకు 4,682 కుటుంబాల సర్వే పూర్తయ్యిందని తెలిపారు. తెలిపారు. ఆయన వెంట ఎంపీవో ఎండీ ఫయాజ్అలీ ఉన్నారు.

సుల్తానాబాద్‌రూరల్,నవంబర్11: నారాయణరావుపల్లి, గొల్లపల్లి, సాంబయ్యపల్లితో పాటు పలు గ్రామాల్లో ఎన్యుమరేటర్లు చేస్తున్న సర్వేను ఎంపీడీవో దివ్యదర్శన్ రావు సోమవారం పరిశీలించారు. ఈనెల 9 నుంచి 10 వరకు 2303 గృహాలను సర్వే చేసినట్లు తెలిపారు.

రామగిరి, నవంబర్ 11 : మండలంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర సర్వే కొనసాగుతుందని ఎంపీడీవో శైలజ రాణి తెలిపారు. మండలంలోని ఆదివారంపేటలో సర్వేను ఆమె పరిశీలించారు.ఇంటింటా సమగ్ర

ముత్తారం, నవంబర్ 11: మండలంలోని ఖమ్మంపల్లిలో సమగ్ర కుటుంబ సర్వేను తహశీల్దార్ సుమన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వేను విజయవంతం చేయడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. అలాగే అడవిశ్రీరాంపూర్ లో సర్వే సరళిని ఎంపీడీవో సురేశ్ పరిశీలించారు. ఇక్కడ రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీధర్, కార్యదర్శి మల్లేశ్వరి, ఎన్యూమరేటర్లు పావని పాల్గొన్నారు.

కుటుంబ సమస్యను పరిష్కరించిన ఏసీపీ

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 11: గోదావరిఖనిలోని యైటింక్లయిన్‌కాలనీకి చెందిన పెద్దల లక్ష్మయ్య కుటుంబ సమస్యను గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్ స్వయంగా వారి ఇంటికి వెళ్లి పరిష్కరించారు. వివరాలిలా ఉన్నాయి. పెద్ద లక్ష్మయ్యకు ఇద్దరు కొడుకులు. తనని పట్టించుకోవడం లేదని లక్ష్మయ్య ఏసీపీ కార్యాలయానికి వచ్చాడు. లక్ష్మయ్య పరిస్థితిని గమనించిన ఏసీపీ నేరుగా బాధితుడిని తీసుకొని అతడి ఇంటికి వెళ్లి అతని ఫిర్యాదు తీసుకున్నాడు. అతని కొడుకులకు కౌన్సిలింగ్ చేసి సమస్యను పరిష్కరించాడు. వైద్య ఖర్చులకు ఏసీపీ రూ. వెయ్యి ఆర్థిక సాయం అందజేశారు.

జ్వరంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

ఓదెల, నవంబర్ 11: పిట్టల ఎల్లయ్యపల్లె అంగన్‌వాడీ టీచర్ ఎలువాక శారద (35) తీవ్ర జ్వరంతో బాధ పడుతూ సోమవారం మృతి చెందింది. 10 రోజులుగా తీవ్రంగా జ్వరంతో ఉండగా మొదటగా కరీంనగర్ దవాఖానకు తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం సాయంత్రం మృతి చెందింది. అంగన్‌వాడీ టీచర్ మృతి పట్ల గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం

పెద్దపల్లి కమాన్, నవంబర్ 11 : టీపీటీఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతకుంట్ల పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా బండిపల్లి పర్శరాములు, ఉపాధ్యక్షులుగా సుద్దాల కుమార్, గడ్డం రాజనర్సు, ఆడెపు రాంనారాయణ, శ్రీగిరి తిరుపతి, కార్యదర్శులుగా వడ్లకొండ స్వామి, ఏ సుధాకర్‌రెడ్డి, మండల సాంబయ్య, తిప్పిశెట్టి శంకర్ ఎన్నికయ్యారు. మాడుగుల రాములు, కోల రాయమల్లు పరిశీలకులుగా వ్యవహరించారు.

దేవునిపల్లి జాతర ఏర్పాట్ల పరిశీలన

పెద్దపల్లి రూరల్, నవంబర్ 11: దేవునిపల్లిలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి జాతర ఈనెల 15 నుంచి ప్రారంభమై 20న ముగియనున్నది. జాతర ఏర్పాట్లను ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. జాతరలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎంపీవో ఎండీ ఫయాజ్ అలీ, కార్యదర్శి ఆవుల అఖిల ఉన్నారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మంథని/మంథని రూరల్, నవంబర్ 11: మంథని మున్సిపల్ తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించనున్నట్లు సీఈవో అశోక్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగాపురి, శ్రీపాదకాలనీ, అంగులూర్, కన్నాల, ఖానాపూర్, స్వర్ణపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమా ప్రారంభించనున్నట్లు వివరించారు.

కలెక్టరేట్‌లో దరఖాస్తులు ఇచ్చేందుకు బారులు తీరిన ప్రజలు

ప్రజావాణికి పోటెత్తుతున్న అర్జీలు

పెద్దపల్లి, నవంబర్11: సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రతీ సోమవారం పెద్ద సంఖ్యలో ప్రజలు అర్జీలు పెట్టుకుంటున్నారు. సోమవారం మినహా మంగళవారం నుంచి శనివారం వరకు కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఫిర్యాధులు స్వీకరిస్తున్నారు. అలాగే ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఆ దరఖాస్తులను కలెక్టర్, అదనపు కలెక్టర్లు సంబంధిత అధికారులకు సిఫారసు చేస్తున్నారు. కానీ సకాలంలో పరిష్కారం కాకనో.. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరించడమో కానీ ప్రజావాణికి అర్జీలు పోటెత్తుతున్నాయి. అధికారులు సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని అర్జీదారులు కోరుతున్నారు.

35 దరఖాస్తులు..

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 35 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎట్టి పరిస్థితిలోనూ ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టకూడదని, సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

ధర్మారం,నవంబర్11: చామనపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంగాధర గంగయ్యను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం పరామర్శించారు. గంగయ్యకు బ్రెయిన్ స్ట్రోక్ రాగా, కరీంనగర్ ప్రతిమ వైద్యశాలలోచికిత్స పొందుతున్నాడు. గంగయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నాడు. అన్ని విధాలుగా గంగయ్యకు అండగా ఉండి ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు ఈశ్వర్ భరోసా ఇచ్చారు.

14న దిశ సమావేశం

పెద్దపల్లి, నవంబర్11: ఈనెల 14న పెద్దపల్లి జిల్లా అభివృద్ధి, సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం కలెక్టరేట్‌లో ఉంటుందని డీఆర్డీవో ఆర్ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిశ చైర్మన్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పాల్గొనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష ఉంటుందని, సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

రవీందర్ సింగ్‌ను ఎమ్మెల్సీగా గెలిపించాలి

మంథని, నవంబర్ 11: సర్దార్ రవీందర్‌సింగ్‌ను ఎమ్మెల్సీగా భారీ మెజార్టీతో గెలిపించాలని శాతవాహన జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య కోరారు. మంథని ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. రవీందర్‌సింగ్ గెలుపు కోసం సుందిళ్ల గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశామని చెప్పారు. రవీందర్‌సింగ్ గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. శనిగరం అరుణ్‌కుమార్, బోడకుంట రమేశ్ ,నైతం మహేశ్, సుధీర్, శివ పవన్, ఉమర్, అనూప్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై హర్షం

జ్యోతినగర్, నవంబర్ 11: రామగుండం కార్పొరేషన్‌లోని రెండో డివిజన్‌లో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నాయకుడు మడిపల్లి మల్లేశ్ సోమవారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. డివిజన్‌లోని సబ్‌స్టేషన్ మెయిన్‌రోడ్ పనులకు భూమి పూజ చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

ఎట్టకేలకు పత్తి కొనుగోలు.. ధర కోసం ఎదురు చూపులు


పెద్దపల్లి ఏఎంసీలో నిరీక్షిస్తున్న పత్తి రైతులు

పెద్దపల్లి, నవంబర్11: సీసీఐ, ప్రభుత్వ తీరుతో రాష్ట్ర జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లుల యాజమాన్యాల సంఘం సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు బంద్ చేస్తున్నట్లు ఆదివారం ప్రకటించింది. ఈ సమాచారం జిల్లా పత్తి రైతులకు తెలియక పెద్దపల్లి మార్కెట్ యార్డుకు తీసుకవచ్చారు. కానీ పత్తి కొనుగోలు చేయమని మిల్లర్లు చెప్పడంతో బిత్తరపోయారు. ఇక్కడి తీసుకవచ్చిన పత్తి కొనకపోతే అదనపు చార్జీలు మీద పడుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, జిన్నింగ్ మిల్లల యాజమాన్యం మధ్య జరిగిన చర్చలు సఫలం అయినట్లు తెలిసింది. దీంతో ఎట్టకేలకు ఖరీదుదారులు పత్తిని కొనుగోలు చేశారు. కానీ ధర తెలుసుకోవటానికి రైతులు సాయంత్రం 4గంటల దాకా ఎదురు చూశారు. రేట్లు పడి తూకం వేసే వరకు పొద్దు పోయిందని, ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల దాకా మార్కెట్‌లోనే ఉండాల్సి వచ్చిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గరిష్ఠ ధర రూ. 6949

పెద్దపల్లి ఏఎంసీకి సోమవారం 274 మంది రైతులు 1021 సంచుల్లో తీసుకవచ్చిన 1123 క్వింటాళ్ల పత్తిని వ్యాపారులు కొనుగోలు చేశారు. క్వింటాలుకు గరిష్ఠంగా రూ. 6949, కనిష్ఠంగా రూ. 6022 పలికిందని ఉన్నత శ్రేణి కార్యదర్శి దేవరాజు పృథ్వీరాజ్ వెల్లడించారు.

కనిపించొద్దని..బోర్డు అడ్డం పెట్టి

- రామగుండం బల్దియా అధికారుల నిర్వాకం

బాడీ ఫ్రీజర్లు కనిపించకుండా అడ్డు పెట్టిన ఫ్లెక్సీ బోర్డు

కోల్‌సిటీ, నవంబర్ 11: రామగుండం కార్పొరేషన్ అధికారులు తప్పును కప్పిపుచ్చుకోవడానికి మరో తప్పు చేస్తున్నారు. 'మూలన పడేసిన బాడీ ఫ్రీజర్లు' శీర్షికన సోమవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది.సుమారు రూ.4లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన ఈ బాడీ ఫ్రీజర్లు నిరుపయోగంగా మూలకు పడేశారు. ఈ విషయం బయటికి రావడంతో అధికారులు ఆలోచించి ఎవరికీ కనిపించకుండా వాటికి అడ్డు పెట్టారు. వినియోగంలోకి తీసుకవచ్చే చర్యలు చేపడితే ప్రజలకు ప్రయోజనం ఉంటుందని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

18 లోగా పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

పెద్దపల్లి కమాన్, నవంబర్ 11 : రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టర్ ఆదేశాల మేరకు పదో తరగతి-2025 పరీక్షలు రాసే విద్యార్థులు ఈ నెల 18లోగా ఫీజులు చెల్లించాలని డీఈవో మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 50 ఫైన్‌తో డిసెంబర్ 2 వరకు, రూ. 200 ఫైన్‌తో డిసెంబర్ 12 వరకు, రూ. 500 లేటు ఫీజుతో డిసెంబర్ 21 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పరీక్ష ఫీజు, దరఖాస్తుల వివరాలు సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయుల వద్ద ఉంటాయని వివరించారు. రెగ్యులర్ విద్యార్థులు రూ. 125, మూడు సబ్జెక్టులు రాసే విద్యార్థులు రూ. 110, మూడు కన్నా ఎక్కువ సబ్జెక్టులు రాసేవారు రూ. 125 ఫీజు చెల్లించాలని సూచించారు. నోటిఫికేషన్‌లోని ఫీజులు కాకుండా విద్యార్థులు నుంచి అదనంగా వసూలు చేస్తే పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని డీఈవో స్పష్టం చేశారు.

'పుడా' బంద్ సక్సెస్

వినతి పత్రం ఇస్తున్న పుడా సాధన సమితి నాయకులు

పెద్దపల్లి, నవంబర్11: పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఇచ్చిన పెద్దపల్లి బంద్ విజయవంతమైందని పుడా సాధన సమితి సభ్యులు తెలిపారు. సోమవారం కొంత మంది దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనగా, కొందరు మాత్రమే దుకాణాలు తెరిచారని తెలిపారు. పురవీధుల గుండా తిరుగుతూ షాపులు బంద్ చేయాలని విజ్ఞప్తి చేయగా, బంద్ సహకరించారని పేర్కొన్నారు. బంద్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పుడా సాధన సమితి సభ్యులు భూషణవేణి రమేశ్ గౌడ్, బొంకూరి సురేందర్ సన్నీ, కావేటి రాజగోపాల్, మంద భాస్కర్ యాదవ్, శ్రీనివాస్, రామ్మూర్తి పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపిక

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 11: రామగుండం కమిషనరేట్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ కుమారుడు టీ పార్థుశ్రీ కృష్ణ జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్‌లోని తేజస్ డిఫెన్స్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో అండర్ - 19 విభాగంలో ప్రతిభ చూపాడు. ఈ నెల 14 నుంచి 16 వరకు గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కోల్‌సిటీ, నవంబర్ 11: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, బల్దియా కమిషనర్(ఎఫ్‌ఏసీ) జే.అరుణ శ్రీ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నగరంలోని వివిధ డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించారు. రాజీవ్ రహదారి వెంట వైద్య కళాశాల సమీపంలో ఎన్‌పీడీసీఎల్ సంస్థ వేసిన విద్యుత్ స్తంభం కారణంగా ఏర్పడిన నీటి సరఫరా పైపులైను లీకేజీని పరిశీలించారు. ఆమె వెంట కార్పొరేషన్ ఈఈ రామన్, డీఈ జమీల్ అహ్మద్, ఏఈ షోయమ్ మీర్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-1 అవగాహన

యైటింక్లయిన్ కాలనీ, నవంబర్ 11: ఆర్జీ-3 ఓసీపీ-1 సైటాఫీసులో కార్మికులకు ఆరోగ్యంపై సోమవారం అవగాహన కల్పించారు. ఆరోగ్య అధికారి డాక్టర్ పద్మ హాజరై సంపూర్ణ ఆరోగ్యం కోసం కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నిత్య వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం నూతనంగా బదిలీపై వచ్చిన ప్రాజెక్టు అధికారి జంగిటి రాజశేఖర్ కార్మికులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ ఉదయ్ హరిజన్, రక్షణాధికారి శ్రీనివాస రావు, సంక్షేమాధికారి సునీల్ ప్రసాద్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ దుగ్యాల తిరుపతి రావు, ఐఎన్టీయూసీ నాయకులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ మాడుగుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గని కార్మికుడి మృతికి నివాళి

గోదావరిఖని, నవంబర్ 11: రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి మృతిచెందిన సింగరేణి ఓసీపీ 5 ఈపీ ఆపరేటర్ సుద్దాల రాంచందర్ కుటుంబాన్ని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ సోమవారం పరామర్శించారు. రాంచందర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, అడిషనల్ సీఎంఓ డాక్టర్ కిరణ్‌రాజ్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, వెల్ఫేర్ ఆఫీసర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు కవ్వంపల్లి స్వామి, మాదన మహేశ్, ప్రభుదాస్, బీఎంఎస్ నాయకులు యాదగిరి సత్తయ్యలు బాధిత కుటుంబ సభ్యలను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

తండ్రి మృతికి కారణమై స్టేషన్‌కు..

- పోలీసు అనుమతితో అంత్యక్రియలకు కొడుకు

సుల్తానాబాద్, నవంబర్ 11 : ఆస్తి తగాదా విషయంలో జరిగిన ఘర్షణలో తండ్రి మధునయ్య చావుకు కారణమైన తనయుడు తొట్ల తిరుపతి సోమవారం అంత్యక్రియలు పూర్తి చేశారు. హత్య కేసులో తిరుపతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలువురు పెద్దల కోరిక మేరకు మానవతా దృక్పథంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారు. భారీ బందోబస్తు మధ్య తిరుపతిని అంత్యక్రియలు జరిగే ప్రదేశానికి తీసుకెళ్లారు. కార్యక్రమం అనంతరం తిరుపతిని ఠాణాకు తరలించారు. తనయుడు తిరుపతి మద్యం మత్తులో జరిగిన సంఘటనను తలుచుకుని తండ్రి కాళ్లపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. విచారణ అనంతరం తిరుపతిని జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. బందోబస్తు సమయంలో సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ పోలీస్ సిబ్బంది ఎలాంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.